# ఎండమావులు

పాలవాడి పిలుపుతో శ్యామలకి మెళుకువ వచ్చింది. ఎన్నిసార్లు చెప్పినా వాడు తన పద్ధతి మానడు. 'మరీ అంత పెందరాళే అక్కర్లేదురా అబ్బీ! ఆరు గంటలకి తెచ్చిపెడితే చాలు' అని ఎన్నిసార్లు చెప్పినా వాడు మాత్రం కోడికూత కంటే ముందుగానే 'అమ్మగారూ పాలు' అని పొలికేక పెడతాడు. వాడిని తిట్టుకుంటూ సణుక్కుంటూ పాలు తీసుకువచ్చి లోపల పడేసి మళ్ళా నడుం వాలుద్దామని ప్రయత్నిస్తుండగానే పని చేసేది దొడ్డి తలుపు అదేపనిగా బాదటం మొదలుపెడుతుంది- దాంతో ఇంకో రోజు ప్రారంభం. ఆదరా బాదరా పనులు మొదలుపెట్టి ఆయనకు భోజనం పెట్టి ఆఫీసుకు పంపేసరికి ఠంగుమని పదకొండు కొట్టేది. కాపరానికి వచ్చిన తరువాత కంటినిండా నిద్దరే కరువైంది.

బుద్ధావతారం వంటి భర్తతో ఒక్కొక్కరోజు ఒక్కొక్క యుగంగా రెండు సంవత్సరాలు గడిచాయి. ఇల్లాగే ఇంకా ఎన్నిరోజులు గడవాలో!

తను ఇంటి పనులతో సతమతమవుతుంటే ఆయన హాయిగా ఆదమరిచి నిద్దరపోతున్నాడు. ఏదో మధురస్వప్నం తాలూకు చిరునవ్వు పెదవులమీద తొంగి చూస్తోంది. నిద్దరలేపడానికి ప్రయత్నం చేస్తే కస్సుమంటాడు. ఆ మనిషిలో కోపమంతా నిద్దరలేపినప్పుడు కనిపిస్తుంది. హాయిగా పడుకోక లేచి ప్రొద్దున్నించీ సాయంత్రం దాకా ఆఫీసులో చాకిరీ చెయ్యాలి. ఇదే ఆయనకి కోపం. అంతకు మినహా మనిషి అందరికంటె ఒక వంతు ఎక్కువ మంచివాడే.

అన్ని రోజులకి మల్లేనే ఈరోజూ ప్రారంభమైంది. మామూలుగా భర్త ఆఫీసుకి వెళ్లిపోయాడు. "సాయంత్రం కొద్దిగా ఆలస్యంగా వస్తా" నని అన్నాడు.

భోజనానంతరం ఎక్కడివక్కడ జాగ్రత్తగా సర్దేసింది. ఇంట్లో ఎక్కడా కూడా ఎటువంటి మార్పూ లేదు. అంతా మామూలుగానే వుంది.

తాంబూలం వేసుకుని భర్త లెటర్‌పాడ్ తీసుకొని వుత్తరం వ్రాయడం మొదలుపెట్టింది. కాపురానికి వచ్చిన యీ రెండు సంవత్సరాలలో భర్తని వదిలి ఎన్నడూ ఆట్టే రోజులుండలేదు. భర్త దగ్గరనుంచి ఉత్తరం వచ్చినప్పుడు తను సమాధానం వ్రాసే లోపల తనను చూడటం కోసమని భర్త వచ్చేవాడు. ఆ కొద్దిరోజులలోనే వియోగం, సంయోగం, దుఃఖం, సుఖం- అన్నీ కనబడేవి. కానీ ఆశ్చర్యమేమిటంటే యీ రెండు సంవత్సరాలలో తను ఒక్కసారికూడా ఆయనకి

పుత్తరం వ్రాయటం జరగలేదు. దానికి అవకాశమే లేకపోయింది. "పుట్టినన్ని నాళ్ళకి పురుషుడు యజ్ఞం చేసాడని" యీనాటికి తాను ఆయనకి ఉత్తరం వ్రాయవలసిన అవసరం కలిగింది.

"మీకు మనసుకి చాలా కష్టం కలుగుతుంది. నా మీద చాలా కోపం రావచ్చు. కాని రాయక తప్పదు. రాయకుండా వెళ్ళిపోతే మీరు అసలు పరిస్థితి తెలుసుకోలేక ఖంగారు పడి నన్ను వెతికించడానికి ప్రయత్నాలు చేసి, నన్ను హైరాణా పెట్టి మీరు హైరాణా పడతారు. యథార్థస్థితిని తెలుసుకున్నప్పుడు వ్యర్థ ప్రయత్నాలు చెయ్యక పరిస్థితిని అర్థం చేసుకుంటారని మీ యిష్టాయిష్టాలకి అనువైన మార్గం మీరే నిర్ణయించుకుంటారని అనుకుంటున్నాను.

ఈ రెండు సంవత్సరాలు జీవితాన్ని ఒక యంత్రంలాగా గడుపుకు వచ్చాను. ఈనాటి వరకు ప్రేమంటే తెలియకుండా నిస్సారమైన జీవితాన్ని గడిపాను. బ్రతికిన నాలుగు రోజులూ హాయిగా బ్రతకాలి. అందుకనే మిమ్మల్ని వదలి దూరంగా వెళ్ళిపోతున్నాను.

నన్ను, నా జీవితాన్ని అంతరిక్షంలోకి లేవనెత్తగల వ్యక్తి ఈనాడు నా జీవితంలోకి ప్రవేశించాడు. ఈ సంఘానికి, ఈ వ్యక్తులకి దూరంగా మా నూతన జీవితాన్ని ప్రారంభిస్తాం.

ఈ రెండు సంవత్సరాలు నన్ను చాలా దయతో చూసారు. అది ఎప్పటికీ కూడా మరువలేను. కాని, ఒక్క జాలి, దయ- వీటివల్లనే జీవితంలో పూర్తి ఆనందం లభించదు.

సెలవు,
శ్యామల"

ఉత్తరం కవరులో పెట్టి, కవరు కాఫీ ఫ్లాస్కు క్రింద పెట్టింది. టైము చూస్తుండగానే రెండు దాటింది. పొయ్యి రాజేసి నిప్పు చేసింది. కాఫీ తనింత త్రాగి, భర్తకి ఫ్లాస్కులో పోసింది. తలుపులు ఎక్కడివక్కడ గడియపెట్టి ఇంటికి తాళం వేసింది. ప్రక్క యింటి తులశమ్మగారు నడవలో కూర్చుని వత్తులు చేసుకుంటోంది. "పిన్నిగారూ! నేను మావాళ్ల యింటికి వెళ్లి యిప్పుడే వస్తా. ఆయన కంటే ముందుగానే వచ్చేస్తాను. ఒక్కడుగు ఆలస్యం అయితే ఆయనకి ఈ తాళం చెవి యివ్వండి" అని ఆవిడకి తాళం చెవి యిచ్చి స్టేషను వైపుకు బయలుదేరింది.

ఈపాటికి స్టేషన్లో వెయిటింగ్ రూం దగ్గర తమకోసమని టిక్కెట్లు తీసుకొని శంకరం ఎదురుచూస్తుంటాడు. "పట్టపగలు ఎవరైనా చూస్తే" అని తను భయపడితే-

"పట్టపగలే ఎవరూ అనుమానించరు. నువ్వు ఏదో ఊరు వెళ్తున్నావని అనుకుంటారు. కథల్లో ప్రేమికుల లాగా, చిమ్మచీకట్లో, ఊరంతా మాటుమణిగిన తరువాత, ప్రియుడు ఒక ఒంటెద్దు బండి తీసుకువచ్చి ప్రియురాలి ఇంటి వెనుక గుమ్మం దగ్గర నిలబెట్టడం, తరువాత రాయో, రప్పో విసరి తన రాకని తెలియజేయటం, దాంతో ప్రియురాలికి తప్ప ఇంట్లో అందరికి మెళుకువ వచ్చి రసాభాస జరగడం... యివన్నీ మనకేం వద్దు. మహారాజులాగ నువ్వు మీ యింట్లోంచి రా. నేను మా యింట్లోంచి వస్తాను... యిద్దరం చెరొక పెట్టెలో ఎక్కి గమ్యస్థానం చేరుకుందాం. అప్పుడు మన గురించి ఎవ్వరూ అపోహపడటం, యివేమీ వుండవు" అన్నాడు. నిజంగా అతను చెప్పిన ఉపాయం ఎంత సులువైంది! అనుకున్న ప్రకారం జరిగింది. టైముకు రైల్వే స్టేషనుకు చేరింది. వెయిటింగ్ రూము ఆడవాళ్లతో కిటకిట లాడుతోంది. కాని శంకరం అక్కడ కనిపించలేదు. బహుశః తను యింకా రాలేదని గేటుదగ్గర చూస్తున్నాడా? లేకపోతే అతను ఇప్పుడే వచ్చి టిక్కెట్లు కొంటున్నాడా? రైలుకు సరిగ్గా పదినిముషాలు టైముంది.

వెయిటింగ్ రూమ్‌లో కూర్చోగానే అక్కడి పనిమనిషి వచ్చి 'టిక్కెట్లు' అని అడిగింది. తను వెంటనే తడుముకోకుండా 'వారి దగ్గరున్నవి- ఇప్పుడే వస్తారు' అని అంది.

రైలు వస్తున్నదని గంట కొట్టారు. దాంతో ఎక్కడివాళ్లక్కడ హడావిడిగా సామాను సర్దుకోవడం, వాళ్ల వాళ్ల కూలీలని పిలిచేసందడిలో వున్నారు. అప్పుడే వచ్చి కూర్చున్న ఒక ఆవిడ శ్యామలని చూసి "ఏ బండికి వెడతారు" అని అడిగింది. తను ముక్తసరిగా "యీ బండికే" అని తలుపువంక చూడటం మొదలుపెట్టింది. శంకరం యింకా రాలేదు. పది నిముషాలు గడిచిపోతున్నాయి. రైలు కూడా ప్లాట్‌ఫారం మీదకు వచ్చేస్తోంది. వచ్చేసింది కూడా. జనమంతా ఒకళ్ళని ఒకళ్లు తోసుకుంటూ రైలు ఎక్కే ప్రయత్నంలో వున్నారు. తను మాత్రం స్థాణువులాగా అక్కడే నిలబడిపోయింది.

శంకరం రాలేదు... ఇన్ని కబుర్లు చెప్పి చివరకు భయపడ్డాడా! ఎందువల్ల రాలేదు? లేకపోతే వచ్చి తనకోసమని ప్లాట్‌ఫారంమీద వెదుకుతున్నాడా? ఇక్కడ ఇల్లాగే కూర్చుంటే రైలు వెళ్ళిపోతుంది. బహుశః శంకరం కూడా దాంట్లో వెళ్ళిపోతే! ఒక్కసారి ప్లాట్‌ఫారం మీద వెదికితే ఎక్కడైనా కనిపించవచ్చు. రైలు ఎక్కేవాళ్ళు చాలామంది ఎక్కేసారు. దిగినవాళ్ళు వాళ్ల వాళ్ల సామానులూ అవీ సరిగ్గా వున్నాయో లేదో చూసుకుంటున్నారు. పెట్టెలన్నీ కలియచూసినా రైలు నిండా జనం కిక్కిరిసి వున్నారు. కానీ ఒక్క శంకరం మాత్రం లేదు.

ఒకసారి తన కాళ్లక్రింద భూమి క్రుంగిపోతున్నట్లు అనిపించింది. తన భర్త యింకా ఎవరో వ్యక్తి తొందరగా తనవైపే వస్తున్నారు.... ఇంటిదగ్గర ఉత్తరం చూసారా! విషయమంతా తెలిసే వుంటుంది. వాళ్ళు తన దగ్గరకు రావటం లేదు. ఆ రెండో ఆయన రైలు ఎక్కి తన భర్తతో ఏదో చెబుతున్నాడు. ఆడవాళ్ళ గుంపులో కలసి స్టేషను బయటకు వచ్చి రిక్షా ఎక్కింది. భర్త స్టేషనునుంచి సరాసరి యింటికివస్తే, తనకంటే ముందరే చేరితే... కొంప కూలిపోతుంది... కాపురం పోతుంది... పోతే తనకేం? అని అనుకునేగా, యీ పని చేసింది? యిన్ని కబుర్లుచెప్పి శంకరం చివరికి ముఖం చాటు వేశాడు. ఏమి మగవాళ్లు? వాళ్ళంతా యింతే! వ్రతం చెడ్డది, ఫలం కూడా చెడింది.

రిక్షా యింటికి చేరింది. వేసిన తాళం వేసినట్లే వుంది. "పిన్నిగారూ, ఆయన వచ్చారా?" అని అడిగింది. "ఇంటికి తాళం కనిపిస్తూ వుంటే ఆయన వచ్చారా? అని అడుగుతున్నావు. ఏం నంగనాచివే" అని సాగతీస్తూ ఆవిడ తాళం చెవి యిచ్చింది.

రిక్షావాడికి డబ్బులిచ్చి ఇంట్లోకి వెళ్ళింది. ఉత్తరం అక్కడే వుంది. ఎవరూ కవరు చింపలేదు. ఫ్లాస్కులో కాఫీకూడా అట్లాగే వుంది. ఉత్తరాన్ని కొన్ని వందల ముక్కలు చేసి చిత్తుకాగితాల బుట్టలో పడేసింది.

కొండంత బరువు దిగి, ఏనుగెక్కినంత సంబరం వేసింది. ఫ్లాస్కులో కాఫీ కొంచెం త్రాగి అద్దం ముందు నుంచుని జడ వేసుకుంటోంది.

బయట తలుపు చప్పుడైంది. తలుపు తీసి నవ్వుతూ నుంచుంది.

ఎదురుగా భర్త నిలబడి వున్నాడు.